క్లుప్తంగా

ఎస్పీని కలిసిన రెడ్ క్రాస్ సభ్యులు



ఎస్పీకి మొక్క అందజేస్తున్న సభ్యులు

సిరిసిల్లటౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన ఎస్పీ అఖిల్ మహాజన్‌ని జిల్లా రెడ్ క్రాస్ కార్యవర్గసభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. సంస్థ చైర్మన్ గుడ్ల రవి, వైస్‌చైర్మన్ వేణుకుమార్, కోఆధికారి గుడిమెట్ శివప్రసాద్, కార్యదర్శి టి శివప్రసాద్, కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, కోడం శ్రీనివాస్, మంతెన సతీశ్ ఉన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఏ జేఏసీ నాయకులు

బోయినపల్లి: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని జిల్లా వీఆర్‌ఏ జేఏసీ నాయకులు గురువారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు బోయినపల్లిలో వినతిపత్రం సమర్పించారు. వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు, వారసులకు ఉద్యోగాలు తదితర సమస్యలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వీఆర్‌ఏల జేఏసీ నాయకులు పైండ్ల చందు, మల్లారపు అర్జున్, మండల వీఆర్‌ఏల జేఏసీ నాయకులు యాద రవీందర్, నాయకులు మన్నె నగేశ్, రమేశ్, మహేశ్ పాల్గొన్నారు.

కంటివెలుగు క్యాంప్ పరిశీలన



క్యాంపును పరిశీలిస్తున్న ఎంపీడీవో

వేములవాడరూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామంలో ప్రారంభించిన కంటి వెలుగు క్యాంపును ఎంపీడీవో రాంరెడ్డి పరిశీలించారు. ఎంపీవో శ్రీధర్, సామ తిరుపతిరెడ్డి ఉన్నారు.

శిబిరం ప్రారంభం

తంగళ్లపల్లి: మండలంలోని చింతలఠాణా గ్రామంలో గురువారం చీర్లవంచ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఒక్కరోజు కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు. శిబిరంలో 86 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 19 మందికి కళ్లజోడు అందజేసి, మరో 21 మందికి కళ్లజోడు కొరకు ఆర్డర్ పెట్టినట్లు మెడికల్ అధికారి రామకృష్ణ తెలిపారు.

ఎన్నాళ్లిలా మా బతుకులు..?

- సొంతిల్లు కలేనా.?
- పురిటినొప్పుల్లో 'డబుల్' పథకం
- ఇళ్లు మంజూరైనా దిక్కులేదు
- ఆరేళ్లుగా ఎదురుచూపు
- పూరి గుడిసెలు, అద్దె ఇళ్లే దిక్కు



ఈ ఫొటోలో ఉన్న వారు చందుర్తి మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన పల్లపు వసంత, లచ్చయ్య దంపతులు. కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. రెక్కాడితే కాని డొక్కాడని స్థితిలో జీవితాన్ని నెట్టుకొస్తున్న వీరికి కనీసం ఉండేందుకు గూడు లేదు. గ్రామ శివారులో సాగుకు యోగ్యం కాని ఓ భూమిలో పట్టాదారుడి అనుమతితో గుడిసె వేసుకున్నారు. ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని ప్రకటించడంతో ఈ పథకంలో తమకు ఇల్లు మంజూరవుతుందని ఆరేళ్లుగా ఎదురు చూస్తున్నారు.



గుడిసెలో నివాసముంటున్న కుటుంబాలు

చందుర్తి: రాష్ట్ర ప్రభుత్వంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్రూం పథకం మండలంలో కలగానే మిగిలిపోయింది. ఇళ్లు లేని ఎంతో మంది నిర్భాగ్యులు సొంతింటి కల నేరవేరుతోందని ఆరేళ్లుగా ఆశతో ఎదురుచూస్తున్నారు. కానీ ఇప్పటి వరకు చందుర్తి మండలంలోని ఏ ఒక్క గ్రామంలో డబుల్ బెడ్రూం పనులు కార్యరూపం దాల్చలేదు. మండలంలోని సనుగులలో 20 మంది లబ్ధిదారులను, జోగాపూర్‌లో 15 మందిని, మూడపల్లిలో 10 మంది లబ్ధిదారులను గ్రామసభలు ఏర్పాటు చేసి 2017లో ఎంపిక చేశారు. కాని ఇప్పటికీ వారికి ఇళ్లు నిర్మించి ఇచ్చే విషయంలో పురోగతి లేదు.

పట్టించుకున్న వారు లేరు

మండలంలోని 19 గ్రామాల్లోని ఇళ్లు లేని నిరుపేదలు దరఖాస్తు చేసుకుని స్థానిక ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఆరేళ్లుగా ఒక్కొక్కరూ పది కన్నా ఎక్కువ సార్లు దరఖాస్తు చేసుకున్నా, వాటికి మోక్షం కలగడం లేదని వాపోతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం సమస్యను దాట వేస్తూ వస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

ప్రచార ఆర్భాటమే..

ఇళ్లు లేని నిరుపేదకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్పా ఇప్పటి వరకు మండలంలో ఒక్క ఇంటిని నిర్మించిన దాఖలాలు లేవు. మండలంలోని మూడు గ్రామాల్లో 45 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినా, స్థలం అందుబాటులో లేదన్న సాకు చూపుతున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

గ్రామాల్లో వారం రోజుల క్రితం ఇళ్లు లేని నిరుపేదల నుంచి స్థానిక ప్రజాప్రతినిధులు దరఖాస్తులు స్వీకరించారు. మండల వ్యాప్తంగా సుమారు 485 దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీరిలో అర్హులైన వారిని గుర్తించే పనిలో బిజీగా ఉన్నట్లు చెబుతున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయంలో దృష్టిసారించి చర్యలకు ఉపక్రమించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

కళ్లు కాయలు కాసినయ్



నా భర్త, కొడుకు ఇద్దరు కలిసి కైకిలు వెళ్తే వచ్చే పైసలతో పూట గడుపుతున్నాం. తెలంగాణ ప్రభుత్వం వచ్చినంక పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని ప్రకటించడంతో ఎంతో మురిసినం. కాని ఇప్పటివరకు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నం.

– గోగుల లచ్చవ్వ, కూలీ, బండపల్లి

అద్దె ఇంట్లో ఉంటున్నాం



ఆరేళ్ల కిత్రమే మా పేరును ఎంపిక చేశారు. గ్రామంలో ఎక్కడ ప్రభుత్వ భూమి లేదని, అందుకే ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు అద్దె ఇంట్లోనే ఉంటున్నం. లక్షలు పెట్టి జాగ కొనుక్కొని ఇల్లు కట్టుకునే స్తోమత లేక అల్లాడుతున్న.

– అడ్మనకార్ నర్సోజీ, సనుగుల

స్పష్టమైన ప్రకటన చేయాలి



గ్రామసభలు పెట్టి ఎంపిక చేసిన లబ్ధిదారులకైనా స్థలాన్ని కొనుగోలు చేసి ఇళ్లు కట్టించి ఇవ్వాలని జెడ్పీ సమావేశాల్లో డిమాండ్ చేసినా స్పందన లేదు. ఇప్పటికైనా డబుల్ బెడ్రూంలపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని ప్రకటించి, నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

– నాగం కుమార్, జెడ్పీటీసీ, చందుర్తి

లబ్ధిదారులను ఎంపిక చేస్తాం



ఇళ్లు లేని నిరుపేదల దరఖాస్తులను వారం రోజుల క్రితమే స్వీకరించాం. వీరిలో అత్యంత పేదలను ఎంపిక చేయాలని ఎమ్మెల్యే, సర్పంచులకు సూచించారు. అర్హులైన వారందరికీ దశల వారీగా ఇళ్ల నిర్మాణానికి సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

– బైరగోని లావణ్య, ఎంపీపీ, చందుర్తి

ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

బోయినపల్లి: రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూ.పది లక్షల వ్యయంతో నిర్మించే పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. రూ. 2 లక్షల కాంట్రిబ్యూషన్ ముదిరాజ్ సంఘం చెల్లించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధితో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వర్లపల్లి వేణుగోపాల్, డీసీఎమ్మెస్ డైరెక్టర్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, సర్పంచ్ గుంటి లతశ్రీ, ఎంపీటీసీ సంబ బుచ్చమ్మ, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టిపెల్లి సుధాకర్, వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, ముదిరాజ్ సంఘం నాయకులు పిట్టల రమేశ్, నల్ల మోహన్, బొజ్జ నరేశ్, బొజ్జ మురళి, ప్రభాకర్, నరేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మండలంలోని రత్నంపేట గ్రామంలో ఆరుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ. 6,00,696 విలువ గల కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో రూ.9.20 లక్షల అంచనాలతో నిర్మించే రజక సంఘం కమ్యూనిటీ హాల్, రూ.ఐదు లక్షల అంచనాలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. సర్పంచ్ రంగి రేణుక, రంగి తిరుపతి, ఈడుగు స్వామి పాల్గొన్నారు.

చిత్రకథ



పార్కింగ్‌లా బస్ షెల్టర్

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజీపేట గ్రామంలో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌లో కొంతమంది వ్యాపారులు వాహనాలను పార్క్ చేస్తున్నారు. దీంతో అక్కడ బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులకు స్థలం లేక రోడ్డుపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

సమాచారం

7న మండల సర్వసభ్య సమావేశం

ఎల్లారెడ్డిపేట: మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ పిల్లి రేణుక అధ్యక్షతన ఈ నెల 7న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చిరంజీవి గురువారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో అభివృద్ధి పనులు, సమస్యలపై శాఖల వారీగా చర్చించడం జరుగుతుందన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అజ్జ వేణు

సిరిసిల్లఅర్బన్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుభాష్‌నగర్‌లోని కార్మిక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన వంట కార్మికులకు పెండింగ్ బిల్లులు మంజూరు చేసి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. వంట గదులను నిర్మించి, ప్రధాన ఉజ్వల యోజన కింద ఉచిత సిలెండర్లను పంపిణీ చేయాలన్నారు. కార్మికులు రూ.3 వేలు గౌరవ వేతనం ఇస్తామని చెప్పి ఇప్పటికి మంజూరు చేయకపోగా, ఉన్న వేతనాన్ని పెండింగ్‌లో ఉంచడం సరికాదన్నారు. తక్షణమే వారికి రూ.5 వేల వేతనాన్ని ప్రకటించాలన్నారు కార్యక్రమంలో రమేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం అందజేత



పరిహారాన్ని అందిస్తున్న డీలర్ అభిషేక్

కోనరావుపేట: ప్రమాదవశాత్తు సిలిండర్ పేలి గుడిసె కాలిపోయిన ఘటనలో హెచ్‌పీ కంపెనీ నుంచి బాధిత కుటుంబానికి పరిహారం అందించారు. 2019లో కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పిట్టల రమేశ్ ఇంట్లో సిలిండర్ పేలి గుడిసె కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం జరిగింది. హెచ్‌పీ డీలర్ గంప అభిషేక్ బాధిత కుటుంబానికి సాయం అందించడం కోసం కంపెనీని కోరగా రూ.85 వేల సాయం మంజూరైంది. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత కుటుంబానికి కోనరావుపేట డీలర్ గంప అభిషేక్ అందజేశారు,.

ఎమ్మెల్యే పరామర్శ



తిరుపతి, చారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కోనరావుపేట: సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, కోనరావుపేట ఎంపీటీసీ చారి తల్లి ఇటీవల మృతి చెందగా వారిని ఎమ్మెల్యే రమేశ్‌బాబు గురువారం పరామర్శించారు. మామిడిపల్లిలో మృతి చెందిన బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కాయితి సత్తయ్య కుటుంబాన్ని, నిమ్మపల్లిలో ఆర్‌ఎస్‌ఎస్ కన్వీనర్ గోగు ప్రతాపరెడ్డిని పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సర్పంచుల ఫోరం కన్వీనర్ పర్శయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రావు, సర్పంచులు ఉన్నారు.

ఘనంగా రుక్మిణీ విఠలేశ్వరుని కల్యాణం

సిరిసిల్లకల్చరల్: శ్రీభక్తాంజనేయ స్వామి ట్రస్టు నిర్వహణలో ఉన్న గాంధీనగర్‌లోని రుక్మిణీ విఠలేశ్వరుని దేవస్థానం 32వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, ధ్వజారోహణం, అష్టోత్తర శతనామావళి, మహాయజ్ఞం నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తుల సమక్షంలో రుక్మిణీ విఠలేశ్వరుని కల్యాణ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరిపారు. వేద పండితులు గోశికొండ దామోదర్, సత్తయ్య, రమేశ్ శాస్త్రోక్త మంత్రోచ్చరణల నడుమ కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గుండ్లపెల్లి నీరజ, దార్నం అరుణ, గడ్డం చందన, మాజీ చైర్‌పర్సన్ ఆడెపు రవిందర్, మాజీ కౌన్సిలర్లు రాపెల్లి దేవదాస్, గుండ్లపెల్లి పూర్ణచందర్, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



కల్యాణానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు



బీరప్ప ఉత్సవాలు ప్రారంభం

కోనరావుపేట: మండలం కొలనూర్‌లో బీరయ్య కామరాతి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు.

ఆర్టీసీ డీఎంకు వీడ్కోలు



స్వామివారి చిత్రపటం అందజేస్తున్న సిబ్బంది

వేములవాడరూరల్: వేములవాడ డిపో మేనేజర్‌గా విధులు నిర్వహించిన భీంరెడ్డి కరీంనగర్‌కు డిప్యూటీ రీజినల్ మేనేజర్ మెకానికల్‌గా పదోన్నతిపై వెళ్లడంతో ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. వేములవాడ డిపో మేనేజర్‌గా కొంత కాలంగా పనిచేస్తున్న ఆయన కరీంనగర్ డిప్యూటీ ఆర్‌ఎంగా పదోన్నతి రావడంతో వేములవాడ డిపో సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించి రాజన్న చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో శ్రీనివాస్, సూపరింటెండెంట్ నరహరి, ప్రభాకర్, అంజయ్య, శ్రీనివాస్, ఆఫీస్ సిబ్బంది, ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

పంచాయతీ పాత భవనం కూల్చివేత



పంచాయతీ భవనాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

వేములవాడరూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మించేందుకు పాత భవనాన్ని గురువారం తొలగించారు. మండలంలోని లింగంపల్లితో పాటు బాలరాజుపల్లి, తుర్కాషినగర్, నమిలిగుండుపల్లి గ్రామాలకు నూతన భవనాలు మంజూరయ్యాయి.

నర్సరీల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని పత్తికుంటపల్లి, కేశన్నపల్లి, ముస్కాన్‌పేట గ్రామాల్లో ఉపాధిహామీ ద్వారా ఏర్పాటు చేసిన హరిత నర్సరీలను ఏపీవో చంద్రయ్య గురువారం పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా రోజుకు రెండుసార్లు నీళ్లు పట్టడంతో పాటు, షేడ్ నెట్లు ఏర్పాటు చేయాలన్నారు.

విద్యపై సర్కార్‌కు చిన్నచూపు

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర ప్రభుత్వం విద్యపై చిన్న చూపు చూస్తోందని, మన ఊరు–మన బడి పేరుతో నిధుల దుర్వినియోగానికి పాల్పడుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి విమర్శించారు. ఎల్లారెడ్డిపేటలోని పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. గంభీరావుపేటలో మంత్రి కేటీఆర్ కేజీ టు పీజీ క్యాంపస్‌ను ప్రారంభించి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఎల్లారెడ్డిపేటతోపాటు మూడు మండలాలకు ఇచ్చిన డిగ్రీ కాలేజీ హామీ ఏమైందని ప్రశ్నించారు. గొల్లపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కల్తీ ఆహారం తిని అస్వస్థతకు గురైన ఇప్పటి వరకు చర్యలు లేవన్నారు. దుమాల గిరిజన గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలు తెల్లవారుజామునే రోడ్డెక్కిన పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గౌస్, లింగంగౌడ్, లక్ష్మారెడ్డి, రాజునాయక్, దేవయ్య, రామచంద్రం, మల్లారెడ్డి, రవి, బాబు, గంగరాజు, రాములు, ఎల్లయ్య, బుచ్చాగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

పౌష్టికాహారం అందించాలి

ముస్తాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులందరికి పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి అన్నారు. మండలంలోని ఆవునూర్‌లో సెక్టార్ సమావేశం గురువారం నిర్వహించారు. ప్రతి నెల లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం సరఫరా చేసే పోషకాహార భోజనాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా సరఫరా చేయాలన్నారు. పోషకాహారంతోపాటు చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

తంగళ్లపల్లి: మండలం చీర్లవంచ గ్రామంలో గురువారం సెస్‌కు ప్రాతినిధ్యం వహించేందుకు గ్రామ సభ నిర్వహించి ఇద్దరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్ జక్కుల రవీందర్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించగా గ్రామానికి చెందిన సూది రాజిరెడ్డి, మానువాడ లక్ష్మణ్ లను గ్రామస్తులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోగిలంచ బ్రహ్మం, నల్గొం జలంధర్ రెడ్డి, ఉమ్మరెడ్డి సత్యనారయణ రెడ్డి, వార్డు సభ్యులు మహేష్, బాబు, విష్ణు, దేవారెడ్డి, ప్రశాంత్, సతీష్, గురువారెడ్డి, కనకయ్య, పాల్గొన్నారు.

ఎల్టా పోటీల్లో ప్రణవి ప్రతిభ

ముస్తాబాద్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన స్టోరీ టెల్లింగ్ పోటీ పరీక్షలో బందనకల్ జెడ్పీ పాఠశాల విద్యార్థిని పాతూరి ప్రణవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయుడు కోనేటి రవి తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతిని గెలుచుకున్న ప్రణవిని డీఈవో రాధాకిషన్ అభినందించారన్నారు. సర్పంచ్ వెంకటేశ్వరి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, ఉపసర్పంచ్ కార్తీక్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

బావి కూలింది

తంగళ్లపల్లి: మండలంలోని తాడూర్ గ్రామ చెరువు శివారులోని బావి కూలిందని గురువారం పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ బావి నీటిపై ఆధారపడి సుమారు 15 మంది రైతులు 20 ఎకరాల భూమిని సాగుచేసుకుంటున్నట్లు తెలిపారు. ఉన్నట్టుండి బావి కూలిపోవడంతో వ్యవసాయానికి నీరు ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. పలువురు బాధిత రైతులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి సాయం

వేములవాడరూరల్: మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన మ్యాడారం లక్ష్మి అనే నిరుపేద కుటుంబానికి మిలీనియం ఫౌండేషన్ సభ్యులు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సెస్ గ్రామ ప్రతినిధుల ఎన్నిక

ఎల్లారెడ్డిపేట: మండలం రాగట్లపల్లి సెస్ గ్రామ ప్రతినిధులుగా సిరిపురం నర్సింహులు, చేకూటి భాస్కర్, రాచర్ల బొప్పాపూర్‌కు ముదమంద రాజు, బొమ్మనవేణి శేఖర్, గొల్లపల్లికి గోగూరి నరసింహ రెడ్డి, శ్యాగ లక్ష్మణ్, దేవునిగుట్ట తండాకు గుగులోత్ నరేశ్ ఎన్నికయినట్లు సెస్ ఏఈ దివ్య తెలిపారు.

ప్రవేశాల కోసం ప్రచారం

వీర్నపల్లి: వీర్నపల్లి మోడల్ పాఠశాలలో ఐదో తరగతిలో 100 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తిగల విద్యార్థులు ప్రవేశాలు పొందాలని ప్రధానోపాధ్యాయులు విశ్వనాథం ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ నెల 15 లోపు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ అని తెలిపారు. మోడల్ స్కూల్‌లో ప్రత్యేక వసతులు, సౌకర్యాలతో విద్యాబోధన అందిస్తున్నామని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. స్పందించిన తల్లిదండ్రులు తమ పిల్లలను మోడల్ పాఠశాలలో చేర్పించేందుకు ముందుకు వచ్చారు.

అభివృద్ధికి సహకరించాలి

వీర్నపల్లి: మారుమూల కొత్త గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులు సహకరించాలని మూడు గ్రామాల సర్పంచులు కోరారు. గర్జనపల్లిలో గురువారం సీతారాంనాయక్ తండా, జవహర్లాల్ నాయక్ తండా, గర్జనపల్లి సర్పంచులు రవి నాయక్, శ్రీనివాస్, గౌరై కరుణ కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించేందుకు మండల స్థాయి అధికారులు సహకరించాలన్నారు. సమావేశంలో మండల మీడియా కోఆర్డినేటర్ చిరంజీవి, గ్రామశాఖ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.